## క్లుప్తంగా

### రాట ముహూర్తం



ఊలపల్లిలో రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బిక్కవోలు: ఈనెల ఆరో తేదీన జరిగే శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఊలపల్లి వెలంపేట రామాలయం వద్ద రాట ముహూర్తం కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ కర్తగా బావిశెట్టి మోహన్, నాగదేవి దంపతులు వ్యవహరించించనున్నారు. ముందుగా ఏర్పాటులకు పందిరి రాట మంచి చేశారు. ఈ కార్యక్రమంలోని రొంగల వీర్రాజు, పోతల వీరబాబు, యడ్ల రామేష్, నెక్కల హరిబాబు, యాళ్ల ప్రసాద్, నెక్కల తాతరావు, పెనగంటి అప్పారావు, ఆలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి



భూదేవి, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి

బిక్కవోలు: కొంకుదురు బుడిత మామిడి వద్ద కొలువైన భూదేవి, పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని వసంత నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక అలంకరణ చేశారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలోని స్వామివారిని లక్ష్మీ, పార్వతి, సరస్వతీ దేవిగా అర్చకులు రమణ శర్మ అలంరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మల్లిడికోదండ బ్రదర్స్ తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


### నిత్యావసరాల పంపిణీ




అనపర్తిలో బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

పెదపూడి: అనపర్తి పరిసర ప్రాంతాల్లో నివసించే నిరుపేద కుటుంబాలకు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ బుధవారం చేశారు. అనపర్తిలోని రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ దాద్వర్యంలో ఈ కుటుంబాలకు వాటిని పంపిణీ చేసి సాయంత్రం తేతలి రామారెడ్డి మంగయమ్మ మహిళా వృద్ధాశ్రమంలో భోజనాలు ఏర్పాటు చేశారు. దుబాయ్‌లో ఎస్‌జీకే ఇన్‌ఫ్రా కంపెనీ పార్టనర్స్ తోరటి వీవీ సత్యనారాయణ, వెలుగుబంటి గణేష్ కుమార్ సహాకారంతో పంపిణీ చేసినట్టు స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ నల్లమిల్లి ఆదిరెడ్డి, తాడి చంద్రశేఖరరెడ్డి, చేవలి శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

### 'వికసిత్ భారత్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ‘వికసిత్ భారత్ 2047 కోసం అకడమిక్ రీసెర్చ్’ అనే పుస్తకాన్ని చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) బుధవారం ఆవిష్కరించారు. ఈ హ్యాండ్ బుక్ ఉపాధ్యాయులకు, పరిశోధకులకు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రచయిత ప్రొఫెసర్ శిశిర్ సహు తెలిపారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి

రాజానగరం: పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించేందుకు ప్రయత్నం చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని కలవచర్లలో 104 ఎకరాలలో ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటుకు సేకరించిన ప్రాంతాన్ని ఏపీఐఐసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే బుధవారం సందర్శించారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాంతం నుంచి రాజానగరం, గండేపల్లి జాతీయ రహదారులను అనుసంధానం చేసే విధంగా ప్రత్యేక రోడ్డు నిర్మాణం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇండస్ట్రీయల్, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# భానుడి ప్రతాపం

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- నిర్మానుష్యంగా రహదారులు
- ఎండల తీవ్రతకు బయటకు రాని స్థానికులు
- వేసవి నేస్తాలుగా క్యాంపులు, పుచ్చకాయలు



ఉష్ణోగ్రతలు పెరగడంతో జనసంచారం లేక వెలవెలబోయిన బూరుగుపూడి జంక్షన్

మధురపూడి: భానుడు భగ్గుమంటున్నాయి. ఏప్రిల్ ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఇళ్లకే పరిమితమవుతున్నారు. మెట్టప్రాంతమైన రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, గ్రామీణ ప్రాంతంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా ఎండల కారణంగా పశువులు మధ్యాహ్నం వేళల్లో చెట్లనీడకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**నిర్మానుష్యంగా ప్రధాన కూడళ్లు, రహదారులు**

ఎండలు తీవ్రం కావడంతో ప్రజలకు ఇళ్లకే పరిమితం కావడంతో రాహదారులు నిర్మానుష్యంగా దర్శనిస్తున్నాయి. మండల కేంద్రాలైన కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లోని రహదారులకు జనసంచారం కొరవడంది. దీంతో రహదారులన్నీ ఖాళీగా ఉంటున్నాయి. మండలంలోని బూరుగుపూడి జంక్షన్ నుంచి రాజానగరం రహదారికి వెళ్లే ప్రధాన రహదారికి వెళ్లే ప్రధాన కూడళి జనసంచారం లేక ఖాళీగా ఉన్నాయి.

| ఉష్ణోగ్రతలు ఇలా | |
|---|---|
| తేదీలు | డిగ్రీలు |
| మార్చి 27 | 35.5 |
| మార్చి 28 | 36.1 |
| మార్చి 29 | 36.67 |
| మార్చి 30 | 35.5 |
| మార్చి 31 | 34.4 |
| ఏప్రిల్ 1, 2 | 34.4 |

ఉష్ణోగ్రతలిలా



వేసవి నేస్తాలుగా పుచ్చకాయలు

ఉష్ణోగ్రతలు తీవ్రమవుతున్నాయి. దీంతో ప్రజలు సన్‌స్ట్రోక్‌కు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 34 నుంచి 36 డిగ్రీలుగా నమోదవుతోంది. వాతావరణంలో మార్పులు కారణంగా బుధ, మంగళ, సోమవారాల్లో 34.4 డిగ్రీల సెల్సియస్ నమోదవ్వగా, గత నెల 27, 28 తేదీల్లో 35.5 డిగ్రీలుండగా, 29న 36.67 డిగ్రీలుంది. 30న ఒక పాయింట్ తగ్గి 35.5 డిగ్రీలుగా నమోదయ్యింది. కాగా ఏప్రిల్ ఒకటిన 34.4 డిగ్రీలకు తగ్గి, ఈరోజు అదే ఉష్ణోగ్రతలను నిలుపుకుంది.

**వాటర్ ఎక్కువగా తీసుకోవాలి**

ఎండలు మండుతుండడంతో ప్రజలు దాహార్తిని తీర్చుకోవడానికి పుచ్చకాయలు, బొప్పాయి, జామకాయలు, పండ్లు జ్యూస్‌లను తాగుతున్నారు. అలాగే ఎండతీవ్రతకు నివారణగా గొడుగులు, తలకు క్యాప్‌లు పెట్టుకుంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండలో పనిచేసేవారు హీట్‌స్ట్రోక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. వీరు ఎక్కువగా ఓఆర్ఎస్‌ను తీసుకుంటే మంచిది. ప్రజలందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రభుత్వం అందించాలి.

> **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
>
> పెరుగుతున్న ఉష్ణాగ్రతల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈ ఎండల ప్రభావం చిన్నారులు, వృద్ధులపై ఎక్కువ ఉంటుంది. ఎక్కువ సేపు ఎండలో ఉంటే హీట్‌స్ట్రోక్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. కూలీలు, కార్మికులు, రైతులు జాగ్రత్తలు పాటించాలి. ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువగా తీసుకోవాలి. ప్రతి గంటకు 4 లీటర్లు చొప్పున ద్రవ పదార్థలు తీసుకోవాలి. కాటన్ దుస్తులు ధరించాలి. హీట్‌స్ట్రోక్ సోకిన వారికి భరించలేని తల నొప్పి, తల తిరగడం, శరీరమంతా ఎర్రగా, డ్రైగా అవుతోంది. కళ్లు తిరగడం, కాళ్లు, కండరాల నొప్పి, వికారంగా ఉండడం ఉంటుంది. ఇలా ఉంటే స్ట్రోక్‌కు గురైనట్టు. అప్పుడు శరీరాన్ని టవల్, స్పాంజ్‌తో తుడవాలి, ఐస్‌ప్యాక్స్ పెట్టడం మంచిది. వైద్యుల సూచనలు పాటించాలి.
>
> – ఐ.జ్ఞానచంద్ర, డాక్టర్, కోరుకొండ, పీహెచ్‌సీ

## ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

- గ్రామ సర్పంచ్ వెంకటరమణ
- 216 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణుడు ప్రసాద్

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుట్టకొండ గ్రామ సర్పంచ్ వల్లు వెంకటరమణ తెలిపారు. పుట్టకొండ గ్రామంలో కాకినాడలోని మౌర్య హాస్పిటల్ వారు సౌజన్యంతో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ తాను సర్పంచ్‌గా నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గ్రామంలో ఈ వైద్యశిబిరం ఏర్పాటు చేశారన్నారు. శిబిరంలో మౌర్య ఆస్పత్రి కిడ్నీ వైద్య నిపుణుడు పుల్ల ప్రసాద్, సిబ్బంది సుమారు 216 మందికి వైద్య పరీక్షలు చేశారు. వాటిలో కిడ్నీ సంబంధిత, స్త్రీలు, చిన్న పిల్లలకు సంబంధించిన వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ వైద్య నిపుణుడు ప్రసాద్, సచివాలయం కార్యదర్శి గౌతమి చంద్ర, వీఆర్వో మహాలక్ష్మి, ఇతర పంచాయతీ పాలకవర్గానికి, తమకు సహకారం అందిస్తున్న ఇతర నాయకులకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎం.శ్రీను, కేతా సత్యనారాయణ, వి.సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవమే బిడ్డలకు మంచిది



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసూతి వైద్య నిపుణులు

పెదపూడి: సిజేరియన్ ద్వారా కాకుండా సాధారణ ప్రసవాలతో బిడ్డలను కనటం ఉత్తమమని అనపర్తి ఏరియా ఆస్పత్రి ప్రసూతి వైద్య నిపుణులు ప్రమీల, వరలక్ష్మి, సుష్మ తెలిపారు. అనపర్తి ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ తాడి రామగురెడ్డి అధ్యక్షతన ప్రసవాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ కాన్పుతో తల్లి బిడ్డ మధ్య అనుబంధం పెరుగుతుందన్నారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, తల్లిబిడ్డను త్వరగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయవచ్చన్నారు. సిజేరియన్ చేయించుకున్న వాళ్లు ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం ఉంటుందన్నారు. అలాగే సాధారణ కాన్పు కోసం గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ పద్మశ్రీ, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతోనే ఉన్నతమైన విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

రాజానగరం: క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థాయికి తీసుకువెళుతుందని, క్రమశిక్షణను తప్పితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ విద్యార్థులకు హితవు పలికారు. క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలలో వివిధ విభాగాలను బుధవారం ఆమె పరిశీలించారు. సోషల్ మీడియా ప్రభావంతో తల్లిదండ్రులు, గురువులపై జోక్స్ వేయడం, వారి మాటలను లెక్కచేయకపోవడం వంటి చేష్టలు సరికాదన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను గ్రహించి, సమాజహితంగా ఎదగాలన్నారు. ఎంచుకున్న లక్ష్యాలను సాధించే దిశగానే అడుగులు వేయాలన్నారు. సీనియర్స్, జూనియర్స్ అనే భేదబావాలు రాకూడదని, సీనియర్లు ఎల్లప్పుడూ జూనియర్లకు మార్గదర్శకులుగా ఉండాలన్నారు.

## రేబిస్ సోకి ఆబోతు మృతి

రాజానగరం: దివాన్‌చెరువులో రేబిస్ సోకి ఒక ఆబోతు బుధవారం మృతి చెందింది. ఆ గ్రామంలో జాతీయ రహదారిపై ఆవులు, ఆబోతులు ఇష్టానుసారంగా తిరుగుతూ, అనేక ప్రమాదాలకు తావిస్తుంటాయి. ఆవుల నుంచి వాటి యజమానులు ఉదయం, సాయంత్రం వేళల్లో పాలు తీసుకుని వదిలేస్తుంటారు. ఇక ఆబోతులను పట్టించుకునేవారే ఉండరు. రెండు రోజులుగా ఒక ఆబోతు కనిపించిన వారందరినీ గాయపరుస్తూ, అందరినీ భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో దానిని స్థానికులు మంగళవారం రాత్రి ఒక చోట కట్టివేశారు. పశువైద్యానికి సంబంధించిన మత్తు వైద్యుని సీతానగరం నుంచి ఉదయాన్నే తీసుకువచ్చారు. అయితే అప్పటికే అది మృతి చెందిందని వైద్యుడు తెలిపారు. పిచ్చి కుక్క కరవడంతో దానికి రేబిస్ సోకిందని, అందుకనే రెండు రోజులుగా తిక్కగా ప్రవర్తించిందని స్థానిక వెటర్నరీ అసిస్టెంట్ గణేశ్వర్రావు అన్నారు. గ్రామంలో తిరుగుతున్న పశువులలో ఇంకా ఇటువంటివి ఉన్నాయోమోననే భయం స్థానికులను వణికిస్తుంది.

## చిన్నారులలో ఆటిజం లేకుండా చేయాలి



బిక్కవోలు భవిత కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

బిక్కవోలు: చిన్నారులలో ఆటిజం లేకుండా చేయాలి అని ఎంఈవో సీహెచ్‌వీ సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన భవిత కేంద్రం వద్ద ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా ఆటిజంపై అవగాహన కార్యక్రమం నిర్విహించారు. ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ వయస్సుకు తగ్గట్లు పిల్లల్లో రావాల్సిన మానసిక పరమైన ఎదుగుదల రాకుండా ఉండే పరిస్థితి నే ఆటిజం అంటారని, ఈ సమస్య పిల్లల్లో బాల్యంలోనే ప్రారంభమయ్యే జీవిత కాలం నాడీ సంబంధిత రుగ్మతగా ఉంటుందన్నారు. వీటిని ఆదిలోని పిల్లల లక్షణాలు గుర్తించి భవిత కేంద్రంలో చేర్పితే మంచి మార్పులను తీసుకురావాడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం చిన్నారులు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోని ఐఆర్‌పీడీ సన్యాసీరావు, తదితర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావమే ఉపాధ్యాయునికి ఆభరణం



సాయిబాబు దంపతులను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

రంగంపేట: సేవా, అంకితభావమే ఉపాధ్యాయునికి ఆభరణమని మర్రిపూడి పుట్టా శ్రీనివాస్ స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో జరిగిన సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు మాచిన సాయిబాబు ఉద్యోగ విరమణ సభకు ఆయన అధ్యక్షత వహించి ఉపన్యాసం చేశారు. సాయిబాబు లాంటి ఉపాధ్యాయుల వల్ల విద్యార్థుల్లో నైతిక విలువలు పెరుగుతాయని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పుట్టా సోమన్నచౌదరి అన్నారు. తమ గ్రామ పాఠశాలలో సాయిబాబు పనిచేయడం గ్రామ అదృష్టమని గ్రామ పెద్ద రిమ్మలపూడి వెంకటేశ్వరరావు అన్నారు. ఉపాధ్యాయుల ఐక్యత కోసం సాయిబాబు చేసిన సేవలు మరువలేనివని పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణ, రాజేష్, ఇందిరాగాంధీ, రాజశేఖర్ పేర్కొన్నారు. సన్మాన గ్రహీత సాయిబాబు మాట్లాడుతూ తాను మర్రిపూడి పాఠశాలకు రుణపడి ఉన్నానని, ఇందుకు గుర్తుగా సౌండ్ సిస్టం, బీరువా అందిస్తున్నానని అన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు, సాయిబాబు కుటుంబ సభ్యులు సాయిబాబు దంపతులను ఘనంగా సత్కరించారు.

## కచ్చితమైన భూ హద్దుల గుర్తింపునకే రీ సర్వే



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

సీతానగరం: రైతులకు చెందిన భూముల కచ్చితమైన హద్దుల గుర్తింపు కోసమే భూ రీ సర్వే అని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మునికూడలి సచివాలయం వద్ద ఆయన ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ రీ సర్వే రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. రైతులు తప్పని సరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కృష్ణ నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ మూర్తి, మండల సర్వేయర్ గౌతమ్, వీఆర్వో కుమారి తదితరులు పాల్గొన్నారు

## లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ , ఏపీఓ

సీతానగరం: నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని ఎంపీడీఓ ఎం.భారతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ భారతి, ఏపీఓ బీవీ సత్యవతి మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి లక్ష్యాలను నిర్దేశించి, వాటికి అనుగుణంగా పని చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలలో ముమ్మరంగా పనులు కల్పించి ఉపాధి వేతనదారులు అందరికీ వంద రోజులు పని కల్పించాలన్నారు. అలాగే సగటు వేతనం రూ 3.07 వచ్చేలా కొలతలు ప్రకారం పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు వీరబాబు, సింహాద్రి, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ నాగేశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్ నాగేశ్వర్రావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాదిహామి సిబ్బంది పాల్గొన్నారు.

## తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన



పెద్దాడలో ఇంటి వద్ద మహిళకు అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో ప్రజలు తడి, పొడి చెత్తను వేరు వేసి గ్రామాన్ని పరిశుభ్రంగా తయారు చేయడానికి సహకరించాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి, పెద్దాడ గ్రామాల్లో బుధవారం ప్రజలకు తడి, పొడి చెత్త వేరువేరుగా వేయాలని కూడలీలోను, ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరుగా వేస్తే దానిని క్లాప్ మిత్రాలు, పంచాయతీ కార్మికులు ఆ చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలిస్తారని, దానిని రీసైకిల్ చేసి విక్రయిస్తారన్నారు. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకుని ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, జి.ఉషా రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మండల సమావేశం

కోరుకొండ: స్థానిక మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం కాపవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు బుధవారం ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్యసూర్యకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ఉదయం 10 గంటలకు మొదలవుతుందని, మండలంలోని ప్రభుత్వ శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతోందని తెలిపారు.

## హెచ్‌ఎమ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి



ఎంపీడీఓ భారతికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీ పాఠశాల హెచ్‌ఎం కె.నాగమణిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండల యూటీఎఫ్ శాఖ డిమాండ్ చేసింది. బుధవారం పాఠశాల సమయం అనంతరం పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు నాగరత్నం కాలనీ పాఠశాలకు చేరుకుని, దాడిని ఖండిస్తు ప్లేకార్డులు ప్రదర్శిస్తు నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.శ్రీమణి మాట్లాడుతూ విద్యార్థులు చేస్తున్న అల్లరులను, తప్పులను తల్లిదండ్రులకు తెలియజేయడం ఉపాధ్యాయుల బాధ్యతని, కాని అలా తెలియజేయడాన్ని తప్పుగా భావించి టీచర్‌పై దాడి చేయడం అమానుషమన్నారు. మండల అధ్యక్షుడు ఎస్.రాజు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులైన ఉపాధ్యాయులపై దాడులు ఇటీవల పెరుగుతున్నాయని, ఉపాధ్యాయులకు రక్షణ కరువైందన్నారు. టీచర్లపై దాడి చేసి, దుర్భాషలాడటం వంటి సంఘటనలతో విద్యార్థుల్లో మంచి నడవడిక ఎలా వస్తుందని అన్నారు. ఉపాధ్యాయులపై దాడికి దిగిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీతానగరం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి ఎంపీడీఓ ఎం.భారతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, మహిళా విభాగం కార్యకర్తలు పాల్గొన్నారు


## ప్రజాభిప్రాయ సేకరణతోనే నూతన ఇసుక ర్యాంపు



ప్రజాభిప్రాయ సేకరణలో ఆర్డీఓ కృష్ణ నాయక్

సీతానగరం: గ్రామ ప్రజల అభిప్రాయంతోనే నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాజమహేంద్రవరం ఆర్డీఓ కృష్ణ నాయక్ తెలిపారు. బుధవారం మునికూడలి గ్రామ సచివాలయం వద్ద నూతన ఇసుక ర్యాంపు ఏర్పాటుపై పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎనిమిది మంది రైతులకు చెందిన ములకల్లంక రెవెన్యూకు చెందిన సుమారు 12 ఎకరాల లంకభూమిలో ఇసుక తవ్వకాలు జరుపుతామన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో తవ్విన ఇసుక మునికూడలి ర్యాంపు నుంచి రవాణా నిర్వహిస్తారని తెలిపారు. దీనిపై గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామని ఆయన తెలిపారు. అలాగే ప్రజాభిప్రామ సేకరణలో పలువురు మాట్లాడుతూ ఇసుక ర్యాంపు ఏర్పాటు వలన కూలీలకు ఉపాధితోపాటు గ్రామాభివృద్ధి చేయాలన్నారు. అయితే ఇసుక ర్యాంపు ఏర్పాటుతో వాహనాలు ఇష్టారాజ్యంగా వెళ్లడంతో పలు ప్రమాదాలు జరుగుతాయని, గ్రామాల వద్ద వాహనాలు వేగంగా వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గోదావరి వరద సమయంలో ఏటిగట్టు కోతకు గురవుతుందని రక్షణ గోడ కట్టాలని, దుమ్ము దూళి ఎగరకుండా రోడ్డును నీటితో తడపాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో మైన్స్ ఏడీ ఫణిభూషన్, డివిజన్ సర్వే డీఐవోఎస్ కృష్ణ, పర్యావరణాధికారి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు

## చలివేంద్రం ఏర్పాటు




సూర్యారావు పేట చలివేంద్రంను ప్రారంభిస్తున్న మాజీ సైనికుడు సురేష్

సీతానగరం: మిర్తిపాడు పంచాయతీ సూర్యారావుపేటలో వైఎస్సార్ సీపీ నాయకులు మాకిరెడ్డి సాయి కల్యాణ్ బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. తన తండ్రి మాకిరెడ్డి అప్పారావు జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సైనికుడు, విశ్రాంత వైమానిక దళ అధికారి అంగటి సురేష్, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి ప్రారంభించారు. అనంతరం వాహనదారులకు, పాదచారులకు, ఆటో ప్రయాణికులు మజ్జిగను అందించారు. పార్టీ నాయకులు జొన్నలగడ్డ సత్యనారాయణ, ఏకరాజు, నడిపల్లి హరిష్, సింగంపల్లి గోపి, అనివిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

## ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో దివాన్‌చెరువు కుర్రోడు



ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందిన ధాన్యం గింజలతో వేసిన వేంకటేశ్వరుని బొమ్మ, చిత్రకారుడు బబ్లూ

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువుకు చెందిన బబ్లూ అనే యువకుడు ధాన్యం గింజలతో వేంకటేశ్వరుని బొమ్మను చిత్రీకరించి, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం పొందాడు. చిన్నప్పటి నుంచి బొమ్మలు గీయడమంటే అతనికి ఎంతో ఇష్టం. దానిని గుర్తించిన అతని తల్లిదండ్రులు కొడుకు ప్రతిభను ప్రోత్సహిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఢిల్లీలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్టస్ కోర్సు చేస్తున్నాడు. బబ్లూ తండ్రి మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రమేష్ డాంగీ కుటుంబ సమేతంగా 25 సంవత్సరాల క్రితం దివాన్‌చెరువు వచ్చి, పానీపూరీ విక్రయిస్తూ జీవనం ప్రారంభించాడు. అప్పటి నుంచి అదే వ్యాపారం చేస్తూ అందరికీ పానీపూరీ రమేష్‌గా చిరపరిచితుడయ్యాడు. ఆర్ఎస్ఎస్ ద్వారా అవకాశం రావడంతో కొడుకు ఆర్ట్స్ అండ్ క్రాఫ్టస్ కోర్సు చేస్తుంటే, కుమార్తె రాజమహేంద్రవరంలో ఇంటర్ చదువుతోంది.

**రెండు లక్షల ధాన్యం గింజలతో..**

కలియుగ దైవం వేంకటేశ్వరుని బొమ్మను రెండు లక్షల ధాన్యం గింజలతో వేయడానికి వారం రోజులు పట్టిందని బబ్లూ తెలిపాడు. వీడియో తీసి, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ పంపించడంతో ఈ గుర్తింపు లభించిందన్నాడు. వారం పది రోజులలో ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్ అవార్డును ఆ సంస్థ జిల్లా కలెక్టర్‌కు పంపిస్తుందన్నాడు. జీవితంలో మంచి ఆర్టిస్టుగా గుర్తింపును పొందడంతోపాటు, తాను పుట్టిపెరిగిన దివాన్‌చెరువుకు మంచి పేరు తీసుకురావాలనేదే తన లక్ష్యంగా పేర్కొన్నాడు.

## డీసీసీబీ మాజీ డైరెక్టర్ సత్యనారాయణమూర్తి మృతి

కడియం: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీబీ మాజీ డైరెక్టర్, కడియపులంక సొసైటీ మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ గట్టి సత్యనారాయణ(82) మూర్తి బుధవారం కన్నుమూశారు. ఆయన సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో ఉండి కడియపులంకతోపాటు, కడియం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు సుబ్బారావు, నరసయ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నరసయ్య కడియపులంక సర్పంచ్‌గా గతంలో సేవలందించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.